# ఆఖరి గుణపాఠం

కెప్టెన్ చంద్రం-కెప్టెన్ సూర్యం ఇద్దరూ 'ఛమ్స్'. ఆవేళ కెప్టెన్ చంద్రం మాంచి ఉత్సాహంగా వున్నాడు. 'బేరక్సు'లో కోలాహలంగా వున్నది. స్వదేశంలో అడుగుపెట్టిన రాజసమూ, కొన్ని సంవత్సరాల తరవాత ఆ గాలి మళ్లీ కొత్తగా పీల్చుకుంటున్న వెర్రి ఆనందమూ సిపాయిల నందర్నీ కుదిపేస్తోంది. ఇళ్లకి ఉత్తరాలు తెగ గిలికి పారేస్తున్నారు; కవాతుగీతాలు, సైనికపదాలు, గవాయిపాటలు పేలిపోతున్నాయి; తూలిపోతున్నారంతా.

3వ బెటాలియన్ మెద్రాసులో రెడ్‌హిల్స్‌కివచ్చి నాలుగు రోజులయింది. ఎత్తులు వెయ్య డంలో కెప్టెన్ చంద్రం అందెవేసిన చెయ్యి. ఎంత అసాధ్యమైన కార్యక్రమమైనా సరే యుక్తిగా రూపొందించి, వొడుదుడుకులులేని దారిని తప్పిపోడానికి, చింతాకైనా సందు దొరకనిపంథాలో నడుపుతాడు బండి; దాని కనువైన అనుచరుల్ని ఎన్నుకుంటాడు కూడా.

సూర్యమూ అంతటివాడే; కానీ రవంత స్తబ్ధు. ఏ పనీ తానుగా సొతహా చేయి చేసుకోలేదు. కాని అంటించి వొదిలిపెడితేమటుకు తారాజువ్వలా తారాపథమందుకుంటాడు. నాలిముచ్చు మనస్తత్వం-అనుచరుడుగా వుపక్రమించి, చక్రాన్ని క్రమక్రమేణా చేతుల్లోకి తెచ్చుకొని డైరెక్టరయి చక్కా ఊరుకుంటాడు - "అమ్మయ్యో అంతపనే?" అని వెనక్కి లాగుతోనే దిగుతాడు; దిగుతోనే నలుగుర్నీ దింపుతాడు; చివరికి, "ఇంకొంచెం లోతుగా వెడితేమటుకేమిటీ?" అన్న సాహసాలకి మొగ్గుతాడు.

ఇటీవల కాలేజీ విద్యార్థినులు హవేళీతోటలో 'పిక్‌నిక్' చేసుకొంటూ వుండగా చెదరగొట్టి నప్పుడూ, మొన్న వెన్నెట్లో 'మెరీనాబీచ్' ఒడ్డున 'బేదింగ్ బ్యూటీ'లమీద సాగించిన దండయాత్రలోను ప్రముఖపాత్ర వహించినవాడు కెప్టెన్ సూర్యం. కాని ఎత్తుగడా, నిర్వహణా, ఉపసంహారమూ కెప్టెన్ చంద్రం చేతిలో రూపొందినై.

'కల్‌నల్'కీ, 'బ్రిగేడియర్'కీ ఒకటి తరవాత ఒకటి 'కంప్లెయింట్లు' వచ్చినై. ఆఫీసర్లు బెదిరించారు. 'వార్నింగు'లిచ్చారు. కాని కెప్టెన్ చంద్రం లొంగలేదు.

మధ్యాన్నం పనిగట్టుకుని కూచున్నాడు చంద్రం. 'బస్రా'లో 'ఇంఫాల్'లో 'మెసపటో మియా'లో తనకొచ్చిన ఉత్తరాలన్నీ చెత్తకింద పోగుచేసాడు గలీజు ఖాళీచేదామని. తండ్రి వ్రాసిన వుత్తరం చదివాడు. తండ్రి శతవృద్ధు. తను మూటగడుతున్న పాపాలకీ, తన అత్యాచారాలకీ ఆ ముసలి హృదయం కంపించిపోతోందని అతని కవగాహనయింది. తల పంకించాడు. ఇంకొకటి – భార్య తులసి వ్రాసిన ఉత్తరం. తనుచేస్తున్న దారుణాలూ, దురంతాలూ కర్ణాకర్ణిగాను, మిలటరీ నించి 'డిస్చార్జి' అయిన సిపాయిల ముఖతానూ వినివుంటుంది బహుశా. అంచాతనే ఉత్తరంలో ఆ చల్లని మందలింపు, తన భవిష్యత్తును గూర్చిన చెప్పలేని ఆవేదన... తరవాత అక్కాయి అనసూయ వ్రాసిన వుత్తరం... ఆమెకింకా తనమీద అధికారమున్నదనే అనుకొంటోంది. ఇంత మంది అలజడికి కారణమైన తన గాథలు ఉదాత్తమైన అంతస్తులో చూచుకొని మురిశాడు లోలోపల.

వీళ్లందరూ తన ప్రవర్తనకి ఇంకా అలవాటుపడలేదు పాపం. కొంటెగా లోపల నవ్వుకొని ఊరుకున్నాడు. నిజమే మరి– ఎట్లా అర్థమవుతుందీ ఎవరికైనా? మిలటరీలో జేరనిక్రితం తానెంత అదుపులో వుండేవాడో! పరస్త్రీలంటే ఎంత లజ్జించేవాడో. ఈ ప్రపంచంలో వున్న మకిలికి ఎంతదూరంగా, అతీతంగా నడిచేవాడో స్మృతికి తెచ్చుకొన్నాడొక్కసారి. ఆ రోజులలో తన ప్రవర్తన దిద్దితీర్చిన హస్తమేదో అతనికి లీలగా గోచరించిందికూడా.

ఇక విసుగు తలకెక్కింది. కట్టకట్టంతా కుండీలోకి విసిరిపారేసి పంకా వదిలి హాయిగా పడుకున్నాడు. ఆనాడు తను పన్నిన వ్యూహానికి చివరి ఘట్టం ఎట్లా నడవాలో ఆలోచన ముగింపు కొచ్చేసరికి గాఢంగా నిద్రపట్టింది.

కెప్టెన్ చంద్రానికి మొరాయించే అందాలంటే మక్కువ ఎక్కువ. పారిపోయే అందాలు, దొరికినా కవుగిట్లో ఇమడని అందాలూ, ఇమిడీ గిజగిజ తన్నుకునే అందాలు, విలవిలలాడి నలుగుడుపడే అందాలు, నలుగుడుపడి తిప్పలుపెట్టే అందాలు, ఎంత లాలించినా, బుజ్జగించినా శక్యం కాని అందాలు, ఎంత బెదిరించినా, ఎంత ఒత్తిడిచేసినా ఎదురుతిరిగే అందాలు, ధిక్కరించే అందాలు, తన బలం కల్పించే అగ్నిశిఖలమీదగాని, అలివికిరాని అందాలు, అనుభవానికి తెచ్చుకోవడంలో పదునుదేరింది అతని కామదాహం.

అతనికి బాగా గుర్తు. ఏడాదిక్రితం దక్షిణాఫ్రికాలో సైనికస్థావరానికి అల్లంతదూరానవున్న టేకుమాను అడవిలోకి 'జీప్' కారు వేసుకుని ఒంటరిగా షికారు వెళ్లాడొకనాడు. ఆ యెత్తయిన పచ్చని కొండలూ, కొండల నంటిపెట్టుకున్న చిక్కని నీడలూ, ఆ నీడలలో అభిసారికలల్లే కిలకిల సాగిపోయే కొండయేళ్లూ, అతని రక్తంలో విపరీతదాహం పుట్టించినయ్. కొండ లోయలోనించి చిన్న సరస్సొకటి తెరుచుకుంది. ఆ మూల నీటిపక్షుల కోలాహలం మధ్యనించి బుడబుడమని శబ్దం వినవచ్చింది. కారాపి దిగివచ్చాడు. దిగి నలువైపులా పరకాయించి చూసాడు. వొడ్డున ఒక నల్ల రాతిబండమీద నిల్చుని నీళ్లు ముంచుతోంది మిసమిసలు చిమ్మే ఒక అందాలరాశి. గులాబీలు చిందిన నీలపురాతి పలకలల్లే నునుపులుదేరిన ఆమె బుగ్గలూ – బుగ్గలనంటిన బండి గురివెందనపువు కేసరాలూ – వయస్సు పొగలుచిమ్మే వొత్తయిన జడా – జడలో ఎర్రని

అడివి 'ఛెర్రీ బ్లోజం' గుత్తులూ... అతని రక్తంలో వెయ్యి కొరడాలొక్కసారిగా ఛెళ్లుమన్నాయి, చూడగానే ఎట్లా పసిగట్టిందో కడవ నీళ్లలోవదిలి, జారే కొండరాళ్ల మీదనించి తుర్రుమంది. ఆమె 'బీటస్' అనే కొండజాతి కన్య. పారిపోతున్న ఆ మొరటు సౌందర్యం బలిసిన టర్కీకోడి వొంపులూ, సొంపులూ ఒలకబోస్తోంది... రివ్వున కూడాపడ్డాడు. పంతంగా వెంటాడి, వేటాడి కొసకి ఎట్లాగయితేనేం చిక్కని చీకట్లు ముసురుకున్న వేళకి చేజిక్కించుకోగలిగాడామెని. తెచ్చుకుని తన డేరాలో, గింగురుమనే మన్యపుగాలి విసుళ్లలో ఆ యవ్వనపు నిగ్గుని ఆహారంగా మార్చు కున్నాడు.

ఆ సంఘటన మొదలు అతనిలో ఒక విపరీతమైన రాక్షసప్రవృత్తి ఆవరించింది.

తరవాత మళ్లీ 'ఇరాక్' దేశంలో దొరికిందతనికి అట్లాంటి వేట. 'బస్రా'లో అతని 'రెజిమెంట్' మకాం వేసింది కొన్నాళ్లు. ఒకనాటి షికారులో కాటుక నీడలలుముకున్న ఒక చక్కని ఖర్జూరపు తోటల గుబురులోనించి తొంగిచూచాడు. పక్కని 'టైగ్రెస్' నదిరేవులో ఒంటరిగా ఈలపాట పాడుతో సాయంకాలపు నీరెండలో నీళ్లు ముంచుతోందొక 'ఇరానీ' కన్యక. అతని రక్తంలో పెద్దపులి అడుగు పెట్టింది. సివంగిలా కలియబడిందామె. ఆ పెనుగులాటలో పడ్డ గాయాల మచ్చలింకా అతని మొహాన్ని అక్కడక్కడా గుర్తుగా నిల్చిపోయాయి కూడా.

నాటినుంచీ అల్లరి సహించని 'హాలీవుడ్' అందాలంటే, అవినీతికి జడిసి ప్రాణాలైనా తెగించి ఎదిరించే ఆటవిక శృంగారమంటే, భర్తల కవుగిళ్లలో నాగరికంగా, ఘోషాగా, అస్తారు బతంగా, అన్యాక్రాంతము కాకుండా శరీరాలు దాచుకునే సుందరాంగులంటే అతనికి ప్రత్యేక ఆకర్షణ. బొంబాయి సఫేదు గల్లీలోనించి కొనితెచ్చుకున్న సౌందర్యాలు, ప్యారిస్ హొటళ్లలో ఎట్లా నొక్కితే అట్లా చొట్టలుపడే తెల్లమైనపుముద్దలు, కాశ్మీరంలో 'దాల్' సరస్సుమీద 'టూరిస్టు కాలనీ'లలోనించి రాత్రిళ్లు రహస్యంగా కావాలనివొచ్చి కౌగిట్లోవాలే గువ్వపిట్టలూ, అతనికి పరమ అసహ్యంగా మారిపోయి కనిపించసాగాయి. అతని రక్తం దేశదేశాలలో రకరకాల దురాక్ర మణలలో, బలాత్కారాలలో విపరీతమైన అలవాట్లని సృష్టించుకుని విజృంభిస్తోంది.

టక్కుటక్కుమన్న బూటుచప్పుడుతో మెళుకువ వచ్చింది చంద్రానికి. 'హల్లో' అంటూ హాజరయ్యాడు కెప్టెన్ సూర్యం. 'టాయిలెట్' చరచర ముగించాడు కెప్టెన్ చంద్రం. అప్పుడే తయారయిన 'బుల్స్ ఐ' అడివిబాతు 'సూప్', గరం గరం 'ఆస్టియర్ స్ట్యూ', 'బ్రాత్', 'డ్రైజిన్' వొక్కటొక్కటే మేజామీద వుంచాడు 'బోయ్', 'కేరట్ స్లయిసు'లతో మొదలుపెట్టి, 'శకపారా' బిస్కట్లతో రుచులందుకొని 'బ్లాక్ కాఫీ', 'స్కాచ్ విస్కీ'తో ముగించి ప్లేట్లన్నీ 'వుఫ్ఫు'న వూదేశారిద్దరూ.

సాయంత్రంమయింది. చురుక్కుమనే వేసవి ఎండ గోరువెచ్చని నీరెండగా మారింది... 'నేవీబ్లూ కోట్లూ', 'హవానా సూట్లూ', 'సెయిలర్ క్యాప్పు'లూ బనాయించి, 'వుడ్ బైన్' సిగరెట్లు వెలిగించి సినిమాహాలుకు బయలుదేరారు. కెప్టెన్ చంద్రం, కెప్టెన్ సూర్యం.

సూర్యబింబం రాత్రి కోరలలో చిక్కుకుని నెత్తుటిధారలు కదుతోంది. సముద్రం హొరుమని ఏడుస్తోంది.

వెనకాల కుర్చీవరసలో కూర్చున్నారిద్దరూ; 'ఇంటర్వల్' వచ్చింది సోడావాళ్ల కేకలు గింగురుమన్నాయి. అప్పుడే 'సెలక్షన్' అయిపోయింది కూడా. ఎదట మొదటి 'రిజర్వ్డు' కుర్చీల వరసలో పంకాల క్రిందుగా కూర్చున్న ఆ యిద్దరు సుందరాంగులలోను ఇవతలపిట్ట చంద్రానిది, అవతలిపిట్ట సూర్యానిది. మసక వెలుగులో ఏ అందం ఎక్కువదో నిర్ణయించడం కష్టంగానే వుంది. పక్కవాటున ఆ చంపల నునుపుమాత్రమే కళ్లబడుతోంది. కాని ఇవతల పిట్ట తనదని నిర్ణయమైపోగానే అవతల పిట్టమీద మోజుగా వుంది చంద్రానికి. తీరా చెప్పేసి అన్యోన్యమూ మార్చుకుంటే మళ్లీ ఇవతల పిట్టమీదకే వ్యామోహం తిరుగుతుందేమో దిక్కుమాలిన గోల - డోలాయమానంగా వున్నది మనస్సు.

'మెయిన్‌స్విచ్' దగ్గర నియామకమైన భీమన్న 'ఎలర్ట్'గానే వున్నాడు. గప్పున లైట్లన్నీ ఆరిపోయాయి. అవతల పిట్టమీద, అంటే సూర్యానికని నిర్ణయమైన పిట్టమీద డేగలా వాలాడు కెప్టెన్ చంద్రం.

అన్ని వేపులనించీ సిపాయిలు సిపాయిలని కోలాహలం బయలుదేరింది. గేటు ఎక్కడున్నదో, గోడ ఎక్కడున్నదో ఎవ్వరికీ గుర్తులేదు. గొల్లున గోలా... ఈలలు... కేకలు... సీత్కారాలు... హాలంతా అల్లకల్లోలమయింది... ఒకటే రణగొణ ధ్వని, ఒకటే తొడతొక్కిడి... జనమంతా చెల్లాచెదురై పరుగులు తీస్తున్నారు. గేటుకీపర్లు, ఆపరేటర్లు, ఎక్కడి వక్కడ వదిలి వుడాయించారు.

కుర్చీలు విరుగుతున్నాయి; బెంచీలు పడిపోతున్నాయి; బల్బులు బద్దలవుతున్నాయి. కెప్టెన్ చంద్రం తన పంజాకి దొరికిన ఎరని జరజర కొండగుహలాంటి ఆపరేటర్ రూమ్‌లోకి ఈడ్చుకొనిపోయాడు. గాలానికి గుచ్చుకొన్న గండుచేపలా గిజగిజ తన్నుకున్నదామె. గిల్లింది; రక్కింది; పెడబొబ్బలు పెట్టింది; అంతా ఆ సముద్రపుహోరులో కలిసిపోయింది. చంద్రం పటకారులో బిగించినట్టు ఆమెని తన బాహువులలో ఇరికించి నిశ్చలంగా ఆమె చేస్తున్న హంగామా అంతా సహించాడంతే. అతనికి తెలుసును; ఇట్లాంటి అందాలెన్ని జీర్ణంకాలేదు తన కౌగిట్లో! ఆఖరికి, ఆమె నిశ్శబ్దంగా వున్నది... అలసిపోయి నిర్జీవంగా తన వక్షస్సుకి హత్తుకుపోయిన ఆ మాంసపుఖండాన్ని ఇక ఆక్రమించుకున్నాడు చంద్రం. అతని రక్తం అణువణువున వేయినాలుకలు సృష్టించుకొని ఆనందాన్ని తోడుకుంటోంది. తన చేతులకింద పడివున్న తిరస్కారం ఇష్టంగా మారుతున్న సూచనలు వూహించుకొని కొసకి తృప్తిపడ్డాడు చంద్రం.

బైట 'జీప్' సిద్ధంగా వుంది. ఆమెనందులోకి జేర్చి, ఆ గోలలోనించీ అలజడిలోనించీ తన 'క్వార్టర్స్'కి తిన్నగా పోనిచ్చాడు కారు. మాటిమాటికీ నెత్తురు రెచ్చకొడుతూంది - వొడలంతా నరనరాన నిప్పుసెగలు!...

తెల్లవార వచ్చింది. ఆమెనా గదిలోనే వుంచేసి బైట గొళ్లెం పెట్టి, పక్కన పడకగదిలోకి వెళ్లిపోయాడు చంద్రం. గాఢంగా నిద్రపట్టింది.

లేచేసరికి చాలా ఆలస్యమయింది. స్నానంచేసి, కూని రాగాలుతీస్తూ, బొంబాయినించి 'కలనల్' కర్జన్ తీసుకొచ్చిన 'మధుబిందు' బొప్పాసికాయని 'స్లైయిసెస్'గా కోస్తూ ఖుషీగా

'రాకింగ్‌చెయిర్'లో వూగిసలాడుతున్నాడు కెప్టెన్ చంద్రం.

ఇక సూర్యం వచ్చి పడతాడు. వచ్చి ఉగ్రుడైపోతాడు. వాడికని నిర్ణయించిన వేట తాను చేజిక్కించుకున్నాడాయెను. వాడికి దుగ్ధగా వుండదూ పాపం. వాడికెట్లాగో సర్ది చెప్పాలి. వాడితో ఎప్పటికప్పుడు రాజీపడుతూండాలి; లేకపోతే ముందుముందు కార్యకలాపాలలో తను ఒంటరివాడై పోతాడు. పాపాన్ని ఒకళ్లతో పంచుకొంటేనేగాని తీరదు ఓ పట్టాన్ని. ఒక ఉల్లా సమూ, తృప్తీ అతని కళ్లలో తొణికిసలాడినై ఆ అంగన వాడిదని నిర్ణయం కాకపోతే తనకామె మీద మోజేలేదు. అది వాడికి తెలీదు. ఇట్లాంటి ఘట్టం వచ్చిందంటే వాడితో నెగ్గడం కష్టమే... ఆలోచించాడు... ఆఖరికి పక్షిని పంజరంలోనించి ఒదిలేముందు ఒకసారి వాడిచేతిలో ఉంచితే సరిపోతుంది!... నవ్వుకున్నాడు. వాడు రాక క్రితమే కడసారి, ఒక్కసారి ఆ అందాన్ని కబళించి పారేసి ఇహ విడుదల చెయ్యాలి – లేకపోతే గగ్గోలు బయలుదేరుతుంది బేరుక్సులో.

విసవిస నడిచి వెళ్లాడు పక్క గదిలోకి. గొళ్లెంతీసి లోపల అడుగుపెట్టగానే కళ్లు జిగ్గుమన్నాయి. గుమ్మందగ్గర నేలమీద ఒక మాంసం ముద్ద పడివుంది వక్షస్సు కెగువని పిడివరకూ దించుకొనిపోయిన ఒక కైజారు! చుట్టూ అంతా నెత్తురు మడుగు!!

అతనికి భయం పుట్టింది. ఆత్మహత్య చేసుకొందిగావును దుర్మార్గురాలు! ఆ కైజారు తనదే... రాత్రి తన మొలలోనించీ తెలియకుండా ఎప్పుడు తీసి దాచుకొన్నదో రాకాసి; చాలా కోపమొచ్చింది. ఏమి చెయ్యాలిప్పుడు?

ఇట్లాంటి సాహసాలకి దిగిన సౌందర్యం తారసిల్లలేదింతవరకూ తనకి. ఈ వంకన సూర్యం తప్పకుండా కసితీర్చుకుంటాడీసారి. పరకాయించి చూసాడు... ప్రాణాన్ని మించిన విలువ శీలానికిచ్చిన స్త్రీమూర్తి! చంద్రబింబంలావున్నదామె ముఖం. చిరుచెమటలో తడిసిన ఆమె శిరోజాలు కంపించే వేళ్లతో తొలిగించి చూచాడు కెప్టెన్ చంద్రం.

ఆమె తులసి! అతని భార్య తులసి!!

ఒక దుర్మార్గుడి చేతిలో తనకి మానభంగమయినదనుకొని అవమానము పొంది ఆత్మహత్య చేసుకున్న తులసి! తన పాపాన్ని తనకి వేలుపెట్టి చూపిపోదామని వొచ్చిన తులసి!!

తన బెటాలియన్ 'రెడ్‌హిల్స్'కి వొచ్చిందని తెలియబరిచాడు మొన్ననే. తనకి హితబోధ చేద్దామని పనిగట్టుకొని వచ్చి ఉంటుంది బహుశా, అని తట్టిందతనికి.

ఆ పవిత్రత ముద్దమీద అట్లాగే కుప్పగా కూలిపోయాడు చంద్రం. ఆమె రక్తంలో అతని కన్నీళ్లు కలిసి ప్రవహించినై.